సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 23 । మార్చి । 2023



హైకోర్టును తాకిన ఓట్ల తొలగింపు వివాదం

రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల ఓట్ల జాబితాలో కొందరు న్యాయవాదుల ఓట్ల తొలగింపు వివాదానికి దారితీసింది. - 8లో



ఘనంగా పెద్దపీరయ్యస్వామి ఆరాధన

పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యుడు ముడుమాల సిద్దయ్య పెద్దకుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. - 8లో

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	515	545
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 178.74 కిలోలు



న్యూస్‌రీల్

4న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని ఏప్రిల్ 4న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ 1,2 డిపో మేనేజర్లు మూరె వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. అల్ట్రాడీలక్స్ సర్వీసులు నడుపుతామన్నారు. రానుపోను రూ.805 చెల్లించాలన్నారు. భక్తులు ముందుగానే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

శ్రీశైలం వెళ్లే భక్తులకు దర్శనం టిక్కెట్లు : శ్రీశైలం వెళ్లే భక్తులకు దర్శనం టిక్కెట్లు ఇస్తున్నట్లు డీఎం ఆర్‌సి నిరంజన్ తెలిపారు. బుకింగ్ కౌంటర్‌లో బస్సు టిక్కెట్టుతో పాటు శీఘ్ర, అతి శీఘ్ర, స్పర్శ దర్శనం టిక్కెట్లు పొందవచ్చన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు లక్కిరెడ్డిపల్లెకు జేసీ రాక

లక్కిరెడ్డిపల్లె : రాయచోటి–వేంపల్లె జాతీయ రహదారి ఏర్పాటుకు జరుగుతున్న పనులను పరిశీలించేందుకు గురువారం జేసీ తమీమ్ అన్సారియా లక్కిరెడ్డిపల్లె రానున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారితో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహులు తెలిపారు.

26న రాజంపేటలో మాలల సింహగర్జన



ప్రచారం చేస్తున్న మాలల జేఏసీ నేతలు

నందలూరు(రాజంపేట) : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో ఈనెల 26న చేపట్టే మాలల సింహగర్జన విజయవంతం చేయాలని మాలల జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నాగిరెడ్డిపల్లె అర్బన్‌లో మాలల జేఏసీ నేతలు సింహగర్జనపై విస్తృత ప్రచారం నిర్వహించారు. సింహగర్జన సందర్భంగా నాగిరెడిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణతో పలువురు దళిత ప్రజాప్రతినిధులు, నాయకులను ఆహ్వానించారు. కార్యక్రమంలో మాలల జేఏసీ నేతలు చొడవరం సుబ్బనరసయ్య, లింగం సంజీవ్, పెనుబాల నాగసుబ్బయ్య, కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె సిటీ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కాలేజీ (బాలికలు) 2023–24 సంవత్సరంలో 5 వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం (ఇంగ్లీషు మీడియం) ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.కన్యాకుమారి తెలిపారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల బాలికలు ఈనెల 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 24 ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సిద్దవటం కోట

వైఎస్సార్ జిల్లాలో దర్శనీయ స్థలాలు

గండికోట, ఒంటిమిట్ట, గండి క్షేత్రం, ఇడుపులపాయ, సిద్దవటం కోట, బ్రహ్మంగారిమఠం

అన్నమయ్య జిల్లాలో దర్శనీయ స్థలాలు

రాయచోటి వీరభద్రాలయం, హార్సిలీహిల్స్

విమాన సౌకర్యం..

పర్యాటకల సాకారం

- వైఎస్సార్ పర్యాటక ప్రాంతాలకు కనెక్టివిటీ
- అందుబాటులోకి రానున్న నైట్ ల్యాండింగ్ విమాన సౌకర్యం
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెరిగిన అవకాశం

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లా పలు రకాల పర్యాటక ప్రాంతాల ఖిల్లాగా కేంద్ర ప్రభుత్వం దృష్టిని కూడా ఆకర్షించింది. గండికోటలో అంతర్జాతీయ ఒబెరాయ్ లాంటి ఆతిథ్య సంస్థలు సెవెన్‌స్టార్ హోటళ్లు, విల్లాల నిర్మాణానికి సిద్ధం కావడంతో అది అంతర్జాతీయంగా క్రమంగా పేరు గడిస్తోంది. దీంతోపాటు జిల్లాలోని ఒంటిమిట్ట, వేంపల్లె గండి, అన్నమయ్య జిల్లా రాయచోటి వీరభద్రాలయం, హార్సిలీహిల్స్‌తోపాటు జిల్లాలో అటు ఆధ్యాత్మిక, ఇటు చారిత్రక ఎకో టూరిజం ప్రాంతాలు ఉన్నాయి. ఇంతవరకు సమస్యగా ఉన్న విమానయానం ఇప్పుడు ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీ అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతాలకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వచ్చే అవకాశం పెరిగింది. దీంతో జిల్లాలోని పర్యాటకప్రాంతాలు మరింతగా పర్యాటకులతో కళకళలాడడంతోపాటు జిల్లాకు ఆర్థికంగా కూడా లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

అంతర్జాతీయ స్థాయిలో

శని, ఆదివారాలు వస్తే చాలు...అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా పేరున్న గండికోట ప్రాంతం పర్యాటకులతో కళకళలాడుతూ ఉంటుంది. దాదాపు రెండు మాసాల ముందు బుక్ చేసుకుంటే కానీ అక్కడి హరిత హోటల్‌లో గదులు దొరికే అవకాశం లేదు. వీకెండ్స్‌తోపాటు ఇతర సెలవు దినాల్లో గండికోటకు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు వస్తుంటారు. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా ఎక్కువశాతం కనిపిస్తారు. మొన్నటివరకు డబ్బుకు వెనుకాడని ఆ ప్రాంత పర్యాటకులు నేరుగా విమాన సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలు, మోటారు బైకుల్లో వస్తున్నారు. వైఎస్సార్ జిల్లా ఇప్పుడు ఆ లోటును తీర్చేందుకు సిద్ధమైంది. జిల్లా కేంద్రమైన కడప నగరంలోని విమానాశ్రయాన్ని ఇటీవల పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచడంతో ఈ అవకాశం ఏర్పడింది. దీంతోపాటు వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటం, బహ్మంగారిమఠం, వేంపల్లె గండి, ఇడుపులపాయ తదితర ప్రాంతాలకు రానున్న పర్యాటకులకు విమాన సౌకర్య అందుబాటులోకి రానుంది. అటు అన్నమయ్య జిల్లాలోని వీరభద్రస్వామి ఆలయం, హార్సిలీ హిల్స్‌తోపాటు పలు ప్రాంతాలకు కూడా కడప విమానాశ్రయం ద్వారా వచ్చే అవకాశం ఉంది.

సమ్మిట్‌తో పెరిగిన అవకాశం

ఈనెల 3, 4 తేదీలలో విశాఖపట్టణంలో జరిగిన జీఐఎస్ ఒప్పందాల కారణంగా మన జిల్లాలో కూడా పలు పరిశ్రమలు రానున్నాయి. ముఖ్యంగా ఇప్పటికే పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఒబెరాయ్ లాంటి కార్పొరేట్ సంస్థలు ఆ సమ్మిట్‌లో పలు ఒప్పందాలు చేసుకున్నాయి.



గండికోటలో పెన్నా నది

విమానాశ్రయం విస్తరణ



కడప విమానాశ్రయ ముఖద్వారం

ఇటీవల కడప ఎయిర్‌పోర్టును విస్తరించారు. రెండు నుంచి పార్కింగ్ స్టాండ్లను ఏడు విమానాల స్థాయికి తెచ్చారు. విమానయాన సంబంధిత అవసరాలను గుర్తించి ఎయిర్‌పోర్టును రూపుదిద్దుతున్నారు. దీంతోపాటు రాత్రి పూట కూడా విమానాలు దిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైన లైటింగ్, ఇతర సాంకేతిక పనులను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాట్లు తుది దశలో ఉండడం, నూతన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేందుకు కేవలం అనుమతులు రావాల్సి ఉండడంతో జిల్లా పర్యాటకంగా కూడా అభివృద్ధి అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలతోపాటు మన జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు ఎక్కువగా విశాఖపట్టణం, విజయవాడ ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు విశేష సంఖ్యలో వస్తున్నారు. ఆధునిక విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో పెద్ద నగరాలకు చెందిన పర్యాటకులు ఈ ప్రాంతానికి ఎక్కువ సంఖ్యలో వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కడప నగరంలోని ప్రైవేటు ట్రావెలింగ్ ఏజెన్సీలు ఇప్పటికే ఆ నగరాల్లోని సాఫ్ట్‌వేర్ సంస్థలతోపాటు ఇతర కార్పొరేట్ సంస్థలకు వెళ్లి విమానాల ద్వారా జిల్లా పర్యాటక ప్రాంతాల సందర్శనకు వీకెండ్ ట్రిప్పులు బుక్ చేస్తున్నారు. ఆయా నగరాల నుంచి నేరుగా విమానం ద్వారా కడపకు ఇక్కడి నుంచి ప్రైవేటు ట్రావెలింగ్ సంస్థలు ఏర్పాటు చేసే కార్లు, ఇతర వాహనాల ద్వారా నేరుగా పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు సౌకర్యం లభిస్తోంది. దీంతో ఇటీవల కడప నగరంతోపాటు జిల్లాలోని ఇతర ప్రాంతాలలో కూడా ప్రైవేటు బుకింగ్ ఏజెన్సీలు వెలిశాయి.

కోదండ రామాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు

స్వామివారికి ఉగాది ప్రత్యేక పూజలు

ఒంటిమిట్ట : రెండవ అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో బుధవారం ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున మూల మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలను తొడిగి, సుగంధ పరిమళమైన తులసీ గజమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. వేకువ జామునుంచే భక్తులు స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం క్యూ లైన్‌లో బారులు తీరారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులను దర్శించుకుని, కాయ కర్పూరం సమర్పించారు.

పంచాంగ శ్రవణం

శ్రీ శోభ కృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కృత నామ సంవత్సర పంచాంగాన్ని ఆలయ ఆస్థాన పురోహితులు వివరించారు. అనంతరం సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో ఊరేగుతున్న సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులు

శ్రీనాథ్‌రెడ్డి మరణం తీరని లోటు

- అనారోగ్యంతో కన్నుమూసిన ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మన్
- పత్రికా రంగంలో.. సీమ ఉద్యమంలో చురుకైన పాత్ర
- పలువురి సంతాపం



దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్, సీనియర్ పాత్రికేయుడు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మరణం అటు పత్రికా రంగానికి, ఇటు ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు. గత కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న శ్రీనాథ్‌రెడ్డి బుధవారం హైదరాబాదులో తుది శ్వాస విడిచారు. సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లె గ్రామానికి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల్లో ఒకరు అమెరికా, మరొకరు బ్రిటన్‌లో ఉన్నారు. ఆయన తల్లి సావిత్రమ్మ కోవరంగుట్టపల్లె సర్పంచుగా పనిచేశారు. తండ్రి ద్వారకనాథరెడ్డి తాడిపత్రిలో కళాశాల నిర్వహిస్తున్నారు. మద్రాసు ట్రిప్లికేన్‌లోని హిందూ హైస్కూలులో 10వ తరగతి అభ్యసించారు. తిరుపతిలోని ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో బీకాం చదివారు. ధర్మవరానికి చెందిన మాజీమంత్రి నాగిరెడ్డి సోదరిని వివాహం చేసుకున్నారు. జేసీ దివాకర్‌రెడ్డి, వేంపల్లె సతీష్‌రెడ్డి సమీప బంధువులే. విదేశాల్లో ఉన్న కుమార్తెలు వచ్చిన తర్వాత అంత్యక్రియలు ఎక్కడ జరపాలో నిర్ణయించనున్నట్లు తెలుస్తోంది.

పత్రికారంగంలో..

శ్రీనాథ్‌రెడ్డి చాలాకాలంగా కడప ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత బీబీసీ, హైదరాబాదులోని సాక్షి ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విధులు నిర్వర్తించారు. కడపలో పనిచేస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా సుమారు రెండున్నర శతాబ్దం పనిచేసి జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడారు. కడప రామాంజనేయపురంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత ఆయనదే. కడప ప్రెస్‌క్లబ్ ఆయన చొరవతోనే ఏర్పాటైంది. ఆనాటి కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులు శ్రీనాథ్‌రెడ్డికి ఎంతో గౌరవం ఇచ్చేవారు.

'సీమ' ఉద్యమంలో..

రాయలసీమ ఉద్యమంలో శ్రీనాథ్‌రెడ్డి ఎంతో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆనాటి ఉద్యమ నేతలు వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి, డాక్టర్ ఎంవీ రమణారెడ్డి, సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతో ఎంతో సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. పత్రికా రంగంలో కొనసాగుతూనే ప్రత్యక్షంగా 'సీమ' ఉద్యమంలో పాల్గొన్నారు. కడపలోని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కార్యాలయం ఆయన హయాంలో నిత్యం రాయలసీమ ఉద్యమ కారులు, రాజకీయ నాయకులతో కిటకిటలాడుతూ ఉండేది. ఇప్పటి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డిని రాయలసీమ ఉద్యమంలోకి ఆహ్వానించి రాయలసీమ యువ పోరాట సమితి ఏర్పాటు చేయించారు.

ప్రెస్ అకాడమి చైర్మన్‌గా..

సుమారు 40 ఏళ్లకు పైబడి పాత్రికేయరంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న శ్రీనాథ్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు తగిన గౌరవం కల్పించారు. ఈ ఐదేళ్లలో రెండుసార్లు ప్రెస్ అకాడమి చైర్మన్‌గా కొనసాగిన ఘనత శ్రీనాథ్‌రెడ్డికే దక్కింది.

పలువురి సంతాపం

శ్రీనాథ్‌రెడ్డి మృతి పట్ల జిల్లాకు చెందిన పలువురు పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాయ లసీమ సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వంటి డిమాండ్లతో సాగిన ఉద్యమంలో ఆయన ఎంతో క్రియాశీలకంగా పాల్గొన్నారని రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన మరణం పాత్రికేయ రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీనియర్ జర్నలిస్టు పమిడికాల్వ మధుసూదన్ పేర్కొన్నారు.

సామర్థ్యం పెంచుతున్నాం.. శత శాతం సాధిస్తాం

'విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. తొలిసారి ఎదుర్కొనే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఆందోళన చెందకుండా ఉత్తమ మార్కులు సాధించే దిశగా వారిని తీర్చిదిద్దుతున్నాం. హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అప్రమత్తం చేయడంతో పాటు పిల్లలను బ్యాచ్‌లుగా విభజించి బోధన అందిస్తున్నాం' అని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ పురుషోత్తం తెలిపారు. ఏప్రిల్ 3వతేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణపై ఆయన పలు విషయలు వెల్లడించారు. – మదనపల్లె సిటీ

- వెనుకబడిన టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- వారిపై నిరంతర పర్యవేక్షణ
- ఆహ్లాదకర వాతావరణంలో పది పరీక్షలు
- జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం



సాక్షి ఇంటర్వ్యూ

? ఈ ఏడాది పరీక్షలు రాసే విద్యార్థులెందరు

జవాబు : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ ఏడాది 22,395 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారు. వీరి కోసం 492 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశాం. వీటిలో కొన్ని కేంద్రాలను సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించి అందులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నాం. అలాగే ప్రశ్నాపత్రాల భద్రతకు నిర్దేశించిన స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేయడంతో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేస్తున్నాం.

? కేంద్రాల వద్ద ఏర్పాట్లు ఎలా

ఇప్పటికే ప్రణాళికలకు అనుగుణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యాశాఖ, రెవెన్యూ, పోలీసు, రవాణా, విద్యుత్, వైద్య, పోస్టల్ తదితర అన్ని శాఖలు కూడా అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. ప్రతి గదిలో ఫ్యాన్, మంచినీటి సౌకర్యం ఉండేలా దృష్టి పెట్టాం.

? విద్యార్థుల సామర్థ్యంపై ఎలాంటి దృష్టి సారించారు

పాఠశాలల తనిఖీ సమయంలో తరగతి గదికి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళికతో చదివిస్తున్నాం. ఈ ఏడాది ప్రతి పరీక్షకు ఒకరోజు, రెండు రోజులు చదువుకునే అవకాశం లభిస్తోంది. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. వందశాతం ఉత్తీర్ణత సాధిస్తామనే విశ్వాసం ఉంది.

? ఈ ఏడాది ప్రశ్నపత్రాల కుదింపు జరిగింది కదా

జ:ఈ ఏడాది పబ్లిక్ పరీక్ష విధానం మారింది. గతంలో ఉండే 11 పేపర్లను 7 పేపర్లుగా కుదించగా, తాజాగా ఆరు పేపర్లుగా మార్పు చేశారు. వంద మార్కుల పరీక్షకు 3.15 గంటల సమయం కేటాయించారు. బుక్‌లెట్ రూపంలో ఉండే జవాబుపత్రంలోనే అన్ని సమాధానాలు పొందుపరచాలి. ప్రీపబ్లిక్ పరీక్షలతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ నూతన ప్రశ్నపత్రం ఎలా ఉంటుందన్న విషయాలపై కూడా అవగాహన కల్పిస్తున్నాం.

? తల్లిదండ్రులు ఎలాంటి చర్యలు తీసుకోవాలి

విద్యాశాఖ అధికారులు,హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలపై ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో చదివేలా వారికి సౌకర్యాలు కల్పించాలి. మంచి ఆహారంతో పాటు ప్రోత్సాహం అందిస్తే పిల్లలు అనుకున్న లక్ష్యాలను అధిగమిస్తారు. పరీక్షల సమయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని గుర్తించి వారికి అండగా ఉండటంతో పాటు మానసికంగా ధైర్యం నింపాలి.

? విద్యార్థులకు మీ సూచన

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కంగారు పడకూడదు. ప్రశ్నపత్రాల కుదింపు విద్యార్థుల సౌలభ్యం కోసం చేసినదే. ప్రీపబ్లిక్ పరీక్షలకు హాజరైన రీతిలోనే ప్రధాన పరీక్షలకు కూడా హాజరవ్వాలి. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేసుకోవాలి. అనుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు కొద్దిగా కష్టపడితే విజయాలు సాధించవచ్చు.

రూ. 10 వేల కోట్లు టర్నోవర్ లక్ష్యం

ఏపీఎండీసీ ఎండీ వి.జి. వెంకటరెడ్డి



ఏపీఎండీసీ పరిపాలన భవనం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ వి.జి. వెంకటరెడ్డి

ఓబులవారిపల్లె : వచ్చే ఏడాది రూ. 10 వేల కోట్లు టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నట్లు ఏపీఎండీసీ ఎండీ వి.జి. వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం మంగంపేట ఏపీఎండీసీ విశ్రాంత భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగంపేట గనుల నుంచి ఈ ఏడాది రికార్డు స్థాయిలో 30 లక్షల టన్నులు బెరైటీస్ ఖనిజం వెలికి తీశామన్నారు. దాదాపు రూ. 1300 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు. గత ఏడాది 20 లక్షల టన్నులు, అంతకు ముందు ఏడాది 25 లక్షల ఖనిజాన్ని వెలికి తీశామన్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఏ గ్రేడ్ ఖనిజం 11 లక్షల టన్నులు వెలికితీసి 28 లక్షల టన్నుల ఖనిజాన్ని విక్రయించినట్లు తెలిపారు. రానున్న రోజులలో ఏపీఎండీసీ ద్వారా రూ. 10 వేల కోట్లు ఆదాయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు స్థానికంగా 50 లక్షల టన్నుల బెరైటీస్ ఖనిజాన్ని వెలికితీసి రూ. 2 వేలు కోట్లు, బొగ్గు గనుల ద్వారా రూ. 2 వేల కోట్లు, ఐరన్ ఓర్ తదితరాల ద్వారా వచ్చే ఆదాయంతో లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. ప్రపంచంలోనే అత్యధిక గ్రావెటీ కల్గిన బెరైటీస్ ఖనిజం మంగంపేట గనులలో ఉందన్నారు. ప్రపంచ మార్కెట్‌లో సగం వరకు మన ఖనిజానికే డిమాండ్ ఉందన్నారు. మంగంపేటలో ఇదే తరహాలో బెరైటీస్ ఖనిజం వెలికితీస్తే ఖాళీ అయిపోతుందని అనంతరం ఆధారపడిన వారి పరిస్థితి ఏమిటని చాలా మంది అభిప్రాయపడుతున్నారని చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సమీప పరిసరాలలో పరిశోధనలు నిర్వహించామని ఇప్పుడు ఉన్నంత స్థాయిలో బెరైటీస్ ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు.రెండు సంవత్సరాలలో ఆ ప్రాంతంలో కూడా మైనింగ్ చేపట్టి ఖనిజాన్ని వెలికితీస్తామన్నారు. ఏపీఎండీసీ సీఆర్‌ఎస్ నిధుల ద్వారా ప్రతి ఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అకాల వర్షాలు, వరదలు వచ్చినప్పుడు, అన్నమయ్య డ్యామ్ తెగిపోయినప్పుడు, బ్రిడ్జిలు కొట్టుకుపోయినప్పుడు సహాయక చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. అంతేకాకుండా ఏపీఎండీసీ పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్టు డాక్టర్‌ను నియమిస్తామన్నారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించేందుకు అన్ని సౌకర్యాలతో అంబులెన్సును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగంపేట బ్లాకోసేల్ ఖనిజంలో ఫుల్లరిన్ నిక్షేపాల కోసం పరిశోధనలు నిర్వహించామన్నారు. ప్రాథమికంగా నిర్ధారణ కూడా చేశామని, ఇటీవలే ఐఎంటీ అనే సంస్థతో ఎంఓయు కూడా చేశామని తెలిపారు. రెండు నెలలలో ఫుల్లరిన్ నిక్షేపాలపై నిర్ధారణ జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు రూ. 50 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. ఫుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే అదనపు ఆదాయం వేలకోట్లలో ఉంటుందన్నారు. కాలుష్య గ్రామాలైన మంగంపేట, కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ, అగ్రహారం గ్రామాలకు మే నెలలో పరిహారం చెల్లించి పూర్తిస్థాయిలో పనులు చేపడతామన్నారు. మంగంపేట ఏపీఎండీసీ పాఠశాలలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సూచన మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వం 8,9 తరగతుల విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లను కూడా ఏపీఎండీసీ విద్యార్థులకు అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి మంచాలమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో మంచాలమ్మ

రామాపురం : మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరులో వెలసిన మంచాలమ్మ తల్లి జాతరను గురువారం, శుక్రవారంలలో జరుగుతుందని కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ జాతర ప్రతి ఏడాది చైత్రమాసం మొదటి రోజున జరుగుతుందన్నారు. మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. మంచాలమ్మ తల్లి పుట్టినిల్లు కోవూరువాండ్లపల్లె నుంచి రాత్రి ఊరేగింపుగా గ్రామంలో ఆలయానికి బయలు దేరేటప్పుడు నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పల్లమ్మతల్లి జాతర


ఆలయంలో కొలువుతీరిన పల్లమ్మతల్లి

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురం పంచాయతీ చెయ్యేరు నది ఒడ్డున వెలసిన పల్లమ్మతల్లి ఉత్సవాలు నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా ఇక్కడి ప్రజల విశ్వాసం. ప్రతి ఏడాది ఉగాది మరుసటి రోజున పల్లమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది రోజు గంగమ్మ తల్లికి పొంగుబాలు పెట్టుకొని మరుసటిరోజు జాతర నిర్వహిస్తారు. జాతర భక్తులు వేల సంఖ్యలో పాల్గొంటారు. కాగా జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ కాలి నరసింహులు తెలిపారు. భక్తుల దర్శనానికి వీలుగా బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు జాతరలో పాల్గొని పల్లమ్మతల్లి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో మంగళవారం జరిగింది. మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ తరుగువారిపల్లెకు చెందిన సుబ్బిరెడ్డి (42) కుటుంబ కలహాల కారణంగా మనస్తాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు.

ఘనంగా పెద్దపీరయ్యస్వామి ఆరాధన


విద్యుత్ దీప అలంకరణలో సిద్దయ్యమఠం


స్వామి దర్శనంకోసం క్యూలో భక్తులు

స్వామి దర్శనంకోసం బారులు తీరిన భక్తులు

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రియ శిష్యుడు ముడుమాల సిద్దయ్య పెద్దకుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం సిద్దయ్యమఠంలో మఠం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా ప్రతి ఏడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలలనుంచే కాకుండా ఇతర జిల్లాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని ముడుమాల, జౌకుపల్లె, కేశాపురం, చెంచయ్యగారిపల్లె, చిన్నాయపల్లె, ఎర్రంపల్లె, అమగంపల్లె, ఇటుగుల్లపాడు తదితర గ్రామాలనుంచి స్వామి దీపారాధన కోసం నూనె డబ్బాలతో వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. మైదుకూరుకు చెందిన భక్తులు ఉచితంగా వాహనాలను ఏర్పాటు చేశారు. వివిధ కులాలకు చెందిన వారు సిద్దయ్యమఠంలో అన్నదానం ఏర్పాటు చేశారు. బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు బండలాగుడు పోటీలు..

పెద్దపీరయ్య ఆరాధన మహోత్సవాల సందర్భంగా గురువారం సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.75 వేలు జెడ్పీటీసీ ఎం రామగోవిందరెడ్డి ఇవ్వనున్నారు. రెండవ బహుమతి రూ. 50 వేలు సిద్దయ్య మఠం నిర్వాహకులు, మూడవ బహుమతి రూ. 30 వేలు ఏఈ రామసుబ్బారెడ్డి బ్రదర్స్ ఇవ్వనున్నారు.

సిద్దవటం కోట అద్భుతంగా ఉంది

కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్‌కుమార్


సిద్దవటం కోటలోని శిల్పసంపదను పరిశీలిస్తున్న కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్‌కుమార్

సిద్దవటం : సిద్దవటం లోని మట్లిరాజుల కోట ఆహ్లాదకరమైన వాతావరణంలో చాలా అద్భుతంగా ఉందని కర్నూల్ రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ అన్నారు. ఒంటిమిట్ట లోని శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ లో భాగంగా బుధవారం శ్రీ కోందడ రామస్వామిని దర్శించుకొని, అనంతరం సిద్దవటం కోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కోటలోని మొదటి, రెండవ మండపాలు, ఢంకానగర్, ఈద్గా, దెబ్బతిన్న నంది విగ్రహం, తవ్వకాల్లో బయల్పడిన శివలింగం, కామాక్షమ్మ గుడి, టిప్పుసుల్తాన్ కాలం నాటి బిస్మిల్లా షావలి దర్గా, మసీదు, రాణి స్నానవాటిక, రాజమహల్, రాణి మహల్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలోని కట్టడాలకు ఉన్న శిల్పసంపద చాలా అద్భుతంగా ఉన్నాయన్నారు. విభిన్న మతాలకు, సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన కట్టడాలు కోటలో ఉన్నాయన్నారు. ఇక్కడి కోట భిన్నత్వంలో ఏకత్వాన్ని తలపించేలా ఉందన్నారు. చారిత్రక కట్టడమైన మట్లిరాజుల కోటలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పురాతత్వ శాఖకు లేఖ రాశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, స్థానిక ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న డీఐజీ

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని సీతారామలక్ష్మణ మూర్తులను బుధవారం ఉగాది సందర్భంగా కర్నూల్ రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ లాంచనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షణ కావించి, సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో వారు కాసేపు సేద తీరి, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరి వెంట కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావు, తులసి నాగప్రసాద్ ఉన్నారు.

ఎనిమిది మందిపై వరకట్న వేధింపు కేసు నమోదు

మదనపల్లె : రెండు వరకట్న వేధింపు కేసుల్లో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు టుటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కృష్ణానగర్‌లోని వినాయకుడి గుడివీధికి చెందిన అఖిల అంజుమ్‌కు గత ఏడాది జులై నెలలో కురబలకోటకు చెందిన కరీముల్లాతో వివాహమైంది. వారం రోజుల క్రితం కరీముల్లా తన భార్యను మదనపల్లెకు పిలుచుకొచ్చి పుట్టింటిలో వదిలిలేసి వెళ్లాడు. ఆమెకు పిల్లలు పుట్టలేదని భర్త, అత్తింటివారు వేధింపులకు గురి చేశారన్నారు. కరీముల్లా తన భార్యకు చెప్పకుండా కువైట్‌కు వెళ్లిపోయాడు. దీంతో కరీముల్లా భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు భర్త కరీముల్లా, మామ కుళ్లాయప్ప, అత్త జరినా, ఆడబిడ్డ భర్త సుబహాన్‌లపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామన్నారు.

మదనపల్లె పట్టణం శివాజీనగర్‌కు చెందిన చందన అలియాస్ సంధ్యారాణికి ఏడాది క్రితం బసినికొండకు చెందిన నవీన్‌కుమార్‌తో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. నవీన్‌కుమార్ తన భార్యను ఇంట్లోనే ఉంచి రెండు నెలల క్రితం కువైట్ వెళ్లాడు. అప్పటి నుంచి డబ్బు పంపించకపోవడంతో పాటు ఆమెకు ఫోన్ చేయకపోవడంతో ఆమెను అత్తింటివారు అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. చందన ఫిర్యాదు మేరకు భర్త నవీన్‌కుమార్, అత్త ఉషారాణి, మామ వెంకటరమణ, ఆడబిడ్డ లావణ్య లపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామన్నారు.

ప్రమాదవశాత్తు వీఆర్ఏ మృతి


పెంచలయ్య (ఫైల్)

ఓబులవారిపల్లె: బోటుమీదపల్లిలో వీఆర్ఏగా పని చేస్తున్న పెంచలయ్య (45) ప్రమాదవశాత్తు జారిపడటంతో బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. ఉగాది పండుగను పురస్కరించుకొని పెంచలయ్య సమీపంలోని గంగమ్మ గుడివద్ద పూజలు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు జారి వెనక్కు పడటంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రైల్వేకోడూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య ఇంద్రమ్మ, కుమార్తె కలరు.

• వీరభద్రుడి పల్లకీ సేవ


పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి వారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్‌లను ప్రత్యేకంగా రంగు రంగు పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే ఉత్సవ మూర్తులకు కూడా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో ఉంచి మాడ వీధులలో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు కూడా పాల్గొన్నారు.

కేవీకే రైతును వరించిన రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం

- రూ.5 వేల నగదుతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేత
- అభినందించిన కేవీకే కోఆర్డినేటర్, శాస్త్రవేత్తలు


రైతు లోమడ సదాశివరెడ్డిని సన్మానించి జ్ఞాపికను ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

కడప అగ్రికల్చర్ : కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం అభ్యుదయ రైతు లోమడ సదాశివరెడ్డికి గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు 2023 సంవత్సరానికి ఉత్తమ రైతు పురస్కారం అందజేశారు.

వ్యవసాయంలో ఆయన అవలంబించిన వినూత్న పద్ధతులకు రాయలసీమ ప్రాంతం తరపున ఉత్తమ రైతుగా ఈయనను ఎంపిక చేశారు. ఈమేరకు బుధవారం ఆయనకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువాతోపాటు రూ. 5 వేల నగదు అందజేసి సత్కరించారు. చాపాడు మండలం వి.రాజుపాలెం గ్రామానికి చెందిన లోమడ సదాశివారెడ్డి తన 14వ ఏట నుంచే తండ్రితో కలిసి వ్యవసాయాన్ని ప్రారంభించారు. 7వ తరగతి వరకు చదువుకున్న ఈయన తనకున్న 5 ఎకరాల్లో వేరుశనగ, మినుము వంటి వ్యవసాయ పంటలతోపాటు దోస వంటి ఉద్యాన పంటలను కొత్త కొత్త వంగడాలతో అధిక దిగుబడులు లక్ష్యంగా సాగు చేస్తున్నారు.

- 1992 నుంచి కడప వ్యవసాయ పరిశోధన కేంద్రం సహకారంతో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ తాను పండించిన విత్తనాలను నేరుగా ప్రభుత్వానికే విక్రయిస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.
- 2017 సంవత్సరం నుంచి తిరుపతి ప్రాంత్రీయ వ్యవసాయ పరిశోధనస్థానం, కడప కృషి విజ్ఞానకేంద్రం సహాయంతో టీబీజీ-104 రకం మినుము, టీసీజీయస్ 1694 వంటి వేరుశనగ పంటలను పండిస్తున్నారు. ఏటా 150 క్వింటాళ్ల దిగుబడులను తీసి 30 క్వింటాళ్ల చొప్పున గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సరఫరా చేస్తున్నారు. అలగే ఇక్కడి ప్రాంత రైతులకు విక్రయిస్తున్నారు.
- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, గుంటూరు, చిత్తూరు, కర్నూలు, తిరుపతి, నెల్లూరు ప్రాంతాలకు చెందిన రైతులు నేరుగా సదాశివారెడ్డి వద్దకు వచ్చి విత్తనాలను తీసుకుని వెళుతుంటారు.
- అంతేకాకుండా జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయం, సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులను, విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులు ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పురస్కారం పొందిన రైతు లోమడ సదాశివారెడ్డిని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, కేవీకే శాస్త్రవేత్తలు అభినందించారు.

• గండిలో గ్రామోత్సవం


గండిలో ప్రత్యేక రథంపై ఊరేగుతున్న వీరాంజనేయస్వామి

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి సన్నిధిలో ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ పఠనం వైభవంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఒంటె వాహనంతో కూడిన రథంపై గండి పురవీధుల్లో ఊరేగించారు. ఈవేడుకల్లో ఆలయ చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, ఆలయ ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

బ్రహ్మంగారిమఠం : తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామి ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ గ్రామోత్సవం లింగాలదిన్నెపల్లె వరుకు చేరుకుంది. స్వామి గ్రామోత్సవం వస్తుందని తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో విరజానందస్వామి, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ భాగ్యం న్యూ HMDA వెంచర్ హైదరాబాద్ @ కొత్తూరు బెంగుళూరు హైవే 1 K.M అన్ని డె॥ క్లబ్‌హౌస్, స్విమింగ్ పూల్ 50% బ్యాంక్ లోన్‌తో ప్లాట్లు కలవు. Ph: 9951329192 [HA-846]

SERVICES

■ పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి వారం రోజులలో రుణంఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173. [T-1783]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 5663]

HEALTH CARE

ఉచితంగా చూడబడును

■ పల్లా హాస్పిటల్, 7 రోడ్ సర్కిల్ నందు ఆర్థోపెడిక్ మరియు గైనకాలజీ విభాగంలో ఉచిత OP శిబిరం: 26-03-2023 మంగళవారం, సమయం : 9.00 AM నుండి 1.30 PM గమనిక: రూ.2000/- విలువైన BMD బోన్ డెన్సిటీ టెస్ట్ ఉచితంగా మరియు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచితంగా చేయబడుతుంది. ఈ శిబిరంలో: కీళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పులు, సర్వైకల్ స్పాండిలైటిస్, లంబార్ స్పాండిలైటిస్, సయాటికా, కీళ్లనొప్పులకు ఉచితంగా చూస్తారు.9849040153. [C-781473]

WANTED

■ లేడీ మేనేజర్ కావలెను! ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు పని చేయుటకు లేడీ మేనేజర్స్ కావలెను. జీతం:12,000 నుండి 20,000 వరకు, కడప సెల్:96765 93424. [C-781474]

■ కడప జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, కావలెను. ఫ్రీ భోజనం+ వసతి కలదు. డ్యూటీ 12 hrs, జీతం: 12000, Age : 20- 45, Cont: 9440074224. [C-781472]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-1124]

■ జీతం: 10K-25K+ రూం Free, Hyd. Qul: 5th- any Degree. Urgent గా కావలెను. స్త్రీలు/ పురుషులు, Nurses, Caretaker కావలెను. ఫోన్ : 9000250893 [HA-92671]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 16K-18K. విజయవాడ. Ph: 9640528899, 9640648899 [HA-1117]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795256]

■ MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంఛైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్ : 70326 10569, 70931 25169. [NA-5449]

■ ప్రముఖ సంస్థలో పార్ట్ / ఫుల్ టైమ్ పనిచేయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్ : 80084 01243 [V- 5664]

■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337. [WA-6917]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



హైకోర్టును తాకిన ఓట్ల తొలగింపు వివాదం!

- రసవత్తరంగా మారిన రాజంపేట బార్ ఎన్నికలు
- 20 మందికి ఓటు హక్కు కల్పిస్తూ ఉత్తర్వులు!
- 31న పోలింగ్ అని ఎన్నికల అధికారి వెల్లడి


రాజంపేట బార్ అసోసియేషన్

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంలోని రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల ఓట్ల జాబితాలో కొందరి న్యాయవాదుల ఓట్ల తొలిగింపు వివాదానికి దారితీసింది. ఎన్నడూలేని రీతిలో బార్ అసోసియేషన్ ఎన్నికల వివాదం హైకోర్టును తాకడం ఇదే ప్రప్రథమం. దీంతో ఎన్నికల వ్యవహారంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

■ బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం లేదన్న కారణం చూపి ఓటరు లిస్టులో నుంచి పలువురు న్యాయవాదుల పేర్లను తొలిగించేశారు. దీంతో తమను ఉద్దేశ్యపూర్వకంగా తీసేశారని ఆవేదన చెందిన న్యాయవాదులు బార్ కౌన్సిల్ చైర్మన్‌ను కలిసి విన్నవించారు. కాగా 130 మంది సభ్యులుగా ఉండగా, 102 మందికి మాత్రమే ఓటు హక్కు కల్పిస్తూ ప్రతిపాదనలు పంపారు. 31న పోలింగ్ నిర్వహించనున్నారు.

ఓటు హక్కు కల్పిస్తూ హైకోర్టు ఆర్డర్

ఓటర్ల జాబితా నుంచి తొలిగించిన వారికి తిరిగి ఓటు హక్కు కల్పించాలని హైకోర్టు ఆర్డర్ జారీ చేసింది. 20మందికి సభ్యత్వం కల్పించి, ఓటు వేసే అవకాశం కలిగేలా హైకోర్టు ఆదేశించింది. అయితే పోలింగ్ ముగిసినా కౌంటింగ్ ఉండదని న్యాయవర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఎన్నికల అధికారి వద్ద ఓటింగ్ బ్యాలెట్‌బాక్స్ సీజ్ భద్రపరుచుకోవాలని హైకోర్టు ఆదేశించినట్లు సమాచారం. తదుపరి ఆర్డర్ వచ్చిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించినట్లు న్యాయవాదులు అంటున్నారు. కోర్టును ఆశ్రయించిన వారిలో సీనియర్ న్యాయవాదులు జిలానీ, రెడ్డయ్య, జల్లి నారాయణ మరికొంతమంది ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం..

రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల వ్యవహారంలో నామినేషన్ల పర్వం ముగిసింది. అసోసియేషన్‌లోని ఇతర పదవులకు నామినేషన్లు పడ్డాయి.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి బాలాజీ మాట్లాడుతూ రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల జాబితాలో లేని న్యాయవాదులకు ఓటు హక్కు కల్పించాలంటూ హైకోర్టు ఆర్డర్ వచ్చిందని చెపుతున్నారని, ఇంకాతనకు అందలేదన్నారు. అలాగే ఓటింగ్‌వరకే అని, కౌంటింగ్ నిలుపుదల అనే అంశంకు సంబంధించి ఆర్డర్ కూడా తనకు రాలేదని స్పష్టంచేశారు. గురువారం స్క్రూట్నీ, రెండురోజులు విత్‌డ్రాలు ఉంటాయన్నారు. అన్ని పోస్టులకు నామినేషన్లు దాఖలు అయ్యాయని వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరు మంది గాయపడ్డారు. తంబళ్లపల్లె మండలం మెరుసుపల్లికు చెందిన నరేష్ (26) భార్య లావణ్య (21), వీరి పిల్లలు అక్షయ (5), మునీంద్రనాయుడు (1) లు మంగళవారం రాత్రి సొంతపనిపై ద్విచక్రవాహనంలో మదనపలెల్లోని బసినికొండకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో వీరి వాహనాన్ని మరో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో నరేష్‌తో పాటు భార్య,పిల్లలు గాయపడ్డారు. గమనించిన స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. కురబలకోట మండలం సింగన్నగారిపల్లెకు చెందిన శ్రీనాథ్ (30) మంగళవారం రాత్రి అంగళ్లకు వస్తుండగా మార్గమధ్యంలోని దొమ్మనబావి వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన బాధితుడిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మరో ప్రమాదంలో చిన్నమండ్యం మండలం కలిబండకు చెందిన శివయ్య (47) మంగళవారం రాత్రి మదనపల్లెకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం గుర్రంకొండ మండలం రెడ్డికోట మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ప్రమాదంలో బాధితుడు గాయపడ్డాడు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్నాడు.

ఈ ఏడాదీ జాతర నిర్వాహకుల మధ్య వివాదం

- చాటింపు వేయించకుండా నిలిపివేసిన వైనం
- బలిజపల్లెలో పోలీసు బందోబస్తు


బలిజపల్లెలో బందోబస్తుగా ఉన్న పోలీసులు

రాజంపేట టౌన్ : ఈ ఏడాది కూడా బలిజపల్లె గంగమ్మ జాతర నేపథ్యంలో నిర్వాహకుల మధ్య వివాదం నెలకొంది. దీంతో ఆ గ్రామంలో ముందస్తు చర్యగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వివరాలు ... గత ఏడాది బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణకు అంకురార్పణ చేసే సమయంలో ఇరు కుటుంబాలకు చెందిన జాతర నిర్వాహకుల మధ్య వివాదం తలెత్తడంతో అప్పట్లో పోలీసులు జాతరను తాత్కాలికంగా రద్దు చేశారు. ఆ తరువాత రెవెన్యూ, పోలీస్‌శాఖకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల జోక్యంతో నెల రోజుల తరువాత జాతరను నిర్వహించారు. అయితే గత ఏడాది తలెత్తిన వివాదం సమసిపోకపోవడంతో ఈ ఏడాది మళ్లీ తెరపైకి వచ్చింది. సాంప్రదాయబద్ధంగా ఉగాది రోజున జాతర నిర్వహణకు చాటింపు వేయించాల్సివుండటంతో పోలీసు అధికారులు గత ఏడాది జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని అమ్మవారికి సమర్పించే సాంగ్యాల విషయంలో తగువులాడుకుంటున్న ఇరు కుటుంబాల వారిని బుధవారం పిలిపించి మాట్లాడారు. అయితే సాంగ్యాల విషయంలో ఇరు కుటుంబాల వారి మధ్య సయోధ్య కుదరలేదు. అందువల్ల అనేక సంవత్సరాలుగా చాటింపు వేయించే కార్యక్రమంతో పాటు జాతర సందర్భంగా గంగమ్మకు వివిధ సాంగ్యాలు చేసే నిర్వాహకులు వివాదాలు, తగువుల మధ్య తాము చాటింపు వేయించలేమని స్పష్టం చేసి పోలీసులకు లిఖిత పూర్వకంగా రాయించారు. దాదాపు రెండువందల సంవత్సరాలకు పైగా జాతర చరిత్రలో ఉగాది కంటే ముందు జాతర జరగకుంటే ఉగాది రోజున చాటింపు వేయక పోవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఇదిలావుంటే ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర విషయంలో కొంత మంది నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరుపట్ల భక్తులు పెదవి విరిస్తున్నారు. కాగా డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ సీఐ నరసింహారావు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బలిజపల్లె గ్రామంలో బుధవారం రాత్రి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్

గత ఏడాది జాతర సందర్భంగా నిర్వాహకుల మధ్య వివాదాలు చోటు చేసుకోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పలు దపాలు పంచాయితీలు చేశారు. ఆ సందర్భంగా తొలి నుంచి అమ్మవారికి ఎవరెవరు ఏయే సాంగ్యాలు చేస్తున్నారో విచారించి, పాతపద్ధతుల్లోనే జాతర నిర్వహించుకోవాలని నిర్వాహకులందరికీ సూచించారు. అలాగే ఎవరెవరు ఏయే సాంగ్యాలు చేస్తారో ఓ జాబితాను కూడా తయారు చేసి నిర్వాహకులకు ఇచ్చారు. అయితే నిర్వాహకులు ఈ ఏడాది అధికారుల ఆదేశాలను పెడచెవిన పెట్టి వివాదాలకు దిగడం ఇప్పుడు సర్వత్రా చర్చానీయాంశమైంది. ఈనేపథ్యంలో రానున్న రోజుల్లో అధికారులు తీసుకునే నిర్ణయం మేరకు జాతర నిర్వహణ ఆధారపడివుంది.